ప్రజాశక్తి
శుక్రవారం 12 జనవరి 2024
5
శ్రీకాకుళం



విద్యార్థులకు నగదు పారితోషికాలు

శ్రీకాకుళం : పది, ఇంటర్‌లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గనుల శాఖ అధికారి వెంకటేశ్వర్లు నగదు ప్రోత్సాహకాలను అందించారు. నగరంలోని నాయీబ్రాహ్మణ సామాజిక భవనంలో గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో విద్యార్థులకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన పది మందికి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురికి, సర్వీస్ కమిషన్ గ్రూప్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వెంకటేష్‌కు మొత్తం 15మందికి పారితోషికం అందించారు. చదువుకునేందుకు నగదును అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు దొంతుకుర్తి త్రినాధరావు, నిర్మలమ్మ దంపతులను ప్రశంసించారు. విశ్రాంత వైద్యారోగ్య ఉప సంచాలకులు, అరవింద్, సంఘ నేతలు దంపతులిరువరిని దుశ్శాలువతో సత్కరించి వారి సేవానిరతిని, సహృదయతను కొనియాడారు.

వైసిపి ఎంపీ అభ్యర్థిగా తిలక్

- **ఇచ్ఛాపురం, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పిరియా విజయ, దువ్వాడ శ్రీనివాస్**
- **వైసిపి మూడో జాబితా విడుదల**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపి అభ్యర్థుల మూడో జాబితాపై మూడు, నాలుగు రోజులుగా నెలకొన్న ఉత్కంఠ వీడింది. శ్రీకాకుళం ఎంపీతో పాటు ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాలకు ఎమ్మెల్యే కొత్త అభ్యర్థులను వైసిపి అధిష్టానం గురువారం మూడో జాబితాను విడుదల చేసింది. ఎవరి అంచనాలకు అందని విధంగా మూడో జాబితా ఉండడంపై అంతా ఆశ్చర్యపోతున్నారు. వైసిపి శ్రేణులను సైతం ఆశ్యర్యానికి గురిచేస్తున్నాయి. గతంలో ఎంపీ అభ్యర్థి కోసం పలువురి పేర్లు వినిపించినా, జాబితాలో వారెవరూ లేకపోవడం గమనార్హం. ఎంపీ అభ్యర్థిగా కనీసం ప్రచారంలోనూ లేని కొత్త అభ్యర్థిని అధిష్టానం తెరపైకి తెచ్చింది. కళింగ కార్పొరేషన్‌గా ఉన్న పేరాడ తిలక్ ఎంపీ అభ్యర్థిగా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకోవడం అందరినీ విస్తుగొల్పుతోంది. ఎంపీ అభ్యర్థిగా ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం పేర్లు ప్రచారంలో ఉన్నా ఆకస్మాత్తుగా పేరాడ తిలక్‌ను ప్రకటించడంతో ఆశ్చర్యపోతున్నారు. టిడిపి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుపై అదే సామాజిక తరగతికి చెందిన ధర్మాన సోదరుల్లో ఎవరినో ఒకరిని పోటీ చేయిస్తారని అందరూ భావించారు. కానీ, అధిష్టానం మాత్రం పేరాడ తిలక్‌ను నియమించింది. 2019 ఎన్నికల్లో కళింగ సామాజిక తరగతి నుంచి దువ్వాడ శ్రీనివాస్ ఎంపీగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. మళ్లీ అదే సామాజిక తరగతి, అదే నియోజకవర్గానికి చెందిన పేరాడ తిలక్ ఎంపీ రామ్మోహన్ నాయుడుపై ఈసారి పోటీ పడనున్నారు. 2019 ఎన్నికల్లో టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి కింజరాపు అచ్చెన్నాయుడు చేతిలో తిలక్ ఓటమి పాలయ్యారు.



పేరాడ తిలక్



దువ్వాడ శ్రీనివాస్



పిరియా విజయ

టెక్కలి నియోజకవర్గం లోనూ అనూహ్య మార్పు చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ తగాదాల నేపథ్యంలో గతేడాది ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పింది. అధిష్టానం మళ్లీ టెక్కలి నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం ఇచ్చింది. ఇప్పటివరకు దువ్వాడ వాణి వైసిపిలో సమన్వయకర్తగా ఉన్నా పెద్దగా ప్రభావం చూపకపోవడంతో ఆమెను తప్పించినట్లు తెలిసింది. రాబోయే ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడుతో శ్రీనివాస్ పోటీ పడనున్నారు. 2109 అచ్చెన్నాయుడపై పోటీ చేసి ఓడిన అభ్యర్థి తిలక్, వచ్చే ఎన్నికల్లో ఎంపీ రామ్మోహన్ నాయుడుపై పోటీ చేయనున్నారు. రామ్మోహన్ నాయుడుపై పోటీ చేసి ఓటమిపాలైన శ్రీనివాస్ వచ్చే ఎన్నికల్లో అచ్చెన్నాయుడుతో బరిలో దిగనున్నారు.

ఇచ్ఛాపురంలో అందరి అంచనాలను తలకిందుల చేస్తూ పార్టీ కొత్త అభ్యర్థిని ప్రకటించింది. ప్రస్తుత నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌తో పాటు రెడ్డిక సామాజిక తరగతికి చెందిన పిలక రాజ్యలక్ష్మి పేర్లను పార్టీ పరిశీలించింది. రాజ్యలక్ష్మి ఇచ్ఛాపురం మున్సిపాలిటీ తప్ప మిగతా మండలాల్లో ఎక్కడా ప్రభావం చూపలేరని పార్టీకి నియోజకవర్గానికి చెందిన ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు అధిష్టానికి సంతకాలతో ఇటీవల లేఖ పంపించారు. సర్వేల ఆధారంగా జెడ్‌పి చైర్‌పర్సన్‌గా ఉన్న పిరియా విజయను రంగంలోకి దించాలని నిర్ణయించింది. మహిళా అభ్యర్థి అయితే విజయ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని భావించిన అధిష్టానం అవకాశం ఇచ్చినట్లు తెలుస్తుంది.

జెడ్‌పి చైర్‌పర్సన్‌గా ఉప్పాడ నారాయణమ్మ



ఇచ్ఛాపురం : జెడ్‌పి చైర్‌పర్సన్‌గా ఇచ్ఛాపురం జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మకు పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ప్రస్తుత జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ రాజీనామా చేసిన పక్షంలో నారాయణమ్మను కొత్త చైర్‌పర్సన్‌గా జెడ్‌పిటిసిలు ఎన్నుకోనున్నారు. రెడ్డిక సామాజిక తరగతికి చెందిన నారాయణమ్మది ఇచ్ఛాపురం మండలం ఈదుపురం. జెడ్‌పి చైర్‌పర్సన్‌గా అనూహ్యంగా ఆమె పేరును అధిష్టానం ప్రకటించింది. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే టిక్కెట్ రెడ్డిక సామాజిక తరగతికి ఇవ్వాలన్న డిమాండ్ నేపథ్యంలో సామాజిక తరగతుల సమీకరణలో పిరియా విజయకు అధిష్టానం టిక్కెట్ కేటాయించింది. దీంతో రెడ్డిక సామాజిక తరగతికి జెడ్‌పి చైర్‌పర్సన్ పదవిని కేటాయించింది.



సంఘీభావం ప్రకటిస్తున్న అఖిలపక్ష నాయకులు

ఎస్మాను రద్దు చేయాలి

- **అంగన్వాడీలకు జీతాలు పెంచాలి**
- **సంక్రాంతి లోపు సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష కార్యాచరణ**
- **ప్రభుత్వానికి అఖిలపక్ష నాయకుల హెచ్చరిక**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని సమ్మె చేపట్టిన అంగన్వాడీలపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అంగన్వాడీల పోరాటానికి మద్దతుగా నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అధ్యక్షతన గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ వంటి ఎటువంటి కార్మిక చట్టాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా తీవ్రంగా దోపిడీ చేస్తోందని విమర్శించారు. అంగన్వాడీలు అతి తక్కువ వేతనాలతో వారి కుటుంబాలను ఏవిధంగా పోషించుకోవాలని ప్రశ్నించారు. అంగన్వాడీలకు ఏం కావాలో తెలుసుకోకుండా భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వానికి సరైన ఆర్థిక విధానం లేదని, సమస్యలపైనా అవగాహన లేదని విమర్శించారు. 31 రోజులుగా అంగన్వాడీలు ఆందోళన చేస్తున్నా మంత్రులకు పట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రి వారి సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్న అబద్ధాలకు అంతు లేకుండా పోయిందని విమర్శించారు. ఎస్మా ప్రయోగించినా అంగన్వాడీలు పట్టు వీడడం లేదంటే వారి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు.

అంగన్వాడీలు అత్యవసర విభాగం అని భావిస్తే, ఇన్ని రోజులు ఎందుకు సమస్యను పరిష్కరించలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆందోళనలు చేస్తుంటే అరెస్టులు చేయడం తెలివితక్కువతనమని విమర్శించారు. సంక్రాంతిలోపు అంగన్వాడీల డిమాండ్లను నెరవేర్చకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగడంతో పాటు రాష్ట్ర బంద్ చేపడతామని హెచ్చరించారు. అంగన్వాడీలపై విధించిన ఎస్మా జిఒ నంబరు 2ను వెంటనే రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జనసేన పార్టీ జిల్లా నాయకులు పేడాడ రామ్మోహనరావు, సిపిఐ నాయకులు చాపర సుందరలాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కోశాధికారి ఎ.సత్యనారాయణ, ఎం.ఆదినారాయణమూర్తి, ప్రకాష్, ఎం.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం పూర్తిస్థాయి ఓటర్ల తుదిజాబితాను ఈనెల 22వ తేదీన విడుదల చేయనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో 26వ వారపు సమావేశాన్ని గురువారం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో లోపాలను సరిదిద్దడానికి రాజకీయ పార్టీలు అందించే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఫారం-6, 7, 8కు సంబంధించిన తుది పరిశీలన పూర్తయిందని చెప్పారు. ఎన్నికల నిబంధనలు తుచా తప్పక పాటించనున్నట్లు స్పష్టం చేశారు. డిసెంబరు తొమ్మిదో తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోవడం జరగదన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు త్వరలోనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. బిఎల్‌ఒ స్థాయిలో దరఖాస్తులు పరిశీలించినట్లు చెప్పారు. ఎటువంటి పొరపాట్లు చోటుచేసుకున్నా బిఎల్‌ఒలదే బాధ్యత అని అన్నారు. అభ్యంతరాలపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఓటరు వివరాలు హ్యాండ్ బుక్ ఇసిఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఈనెల 12వ తేదీ నాటికి అన్నిస్థాయిల్లో క్లయిమ్‌లకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరినట్టుగానే డబుల్ ఎంట్రీ, పోలింగ్ బూత్‌లు తదితర అంశాలపై నివేదిక అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, బిఎస్‌పి నాయకులు ఎల్.సోమేశ్వరరావు, బిజెపి నాయకులు పసుపులేటి సురేష్‌బాబు సింగ్, సి-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు, డిటి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య చర్చలు ఫలించడంతో నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు పి.మురళీకృష్ణ తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్రశిక్ష, కెజిబివి ఉద్యోగులు 22 రోజుల పాటు నిర్వహించిన నిరవధిక సమ్మెను విరమించారు. నిరవధిక సమ్మెలో భాగంగా కలెక్టరేట్ సమీపాన జ్యోతిరావు పూలే పార్కు వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో గురువారం మాట్లాడారు. శుక్రవారం నుంచి యథావిధిగా విధుల్లో చేరుతున్నట్లు తెలిపారు. 2017 నుంచి వేతనాలు పెరగని అన్ని క్యాడర్లకు 23 శాతం వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు ఇస్తారని తెలిపారు. రానున్న కాలంలో అన్ని కేడర్లకు వేతనాలను ఒకేసారి పెంచేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. 0-5, 5-10, 10-15 సర్వీసులో ఉన్న వారి సంఖ్యను గుర్తించి ఎంటిఎస్ అమలుపై నిర్ణయిస్తారన్నారు. జాబ్‌ఛార్టు లేని కేడర్లకు జాబ్‌ఛార్టు ఇచ్చేందుకు అంగీకారం తెలిపినట్లు వివరించారు. ఖాళీల భర్తీల్లో డైలీవేజ్, స్టాఫ్ గ్యాప్, గెస్ట్ ఉద్యోగులకు ప్రాధాన్యతనిస్తారన్నారు. సమ్మె వల్ల తొలగింపబడిన వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుని వేతనాలు చెల్లిస్తారన్నారు. రెగ్యులరైజేషన్, చైల్డ్‌కేర్ లీవ్‌లు, నెలనెలా వేతనాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

17,600 మందికి 'జగనన్న తోడు'

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో జగనన్న తోడు పథకం కింద 17,600 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.18.62 కోట్ల రుణాలను జమ చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. మరో 24,740 మందికి రూ. 52.18 లక్షల వడ్డీని జమ చేసినట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జగనన్న తోడు కార్యక్రమంలో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు రుణాలు తీసుకొని సకాలంలో తిరిగి చెల్లించిన వారికి జగనన్న తోడు పథకం ద్వారా తిరిగి రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. నాలుగో విడత వడ్డీని ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఈ పథకం వల్ల తోపుడుబళ్ళు, సంప్రదాయ వృత్తి కళాకారులు, ఫుట్‌పాత్‌లపై, ప్రజా, ప్రైవేట్ స్థలాల్లో తోపుడుబళ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న వారు, తల మీద గంపలో వస్తువులు మోస్తూ అమ్ముకునే వారు, సైకిల్, మోటార్ సైకిల్, ఆటోలపై వ్యాపారం చేసుకుంటున్న వారు, చేతివృత్తిదారులు, కళాకారులు, తదితర వ్యాపారులు తమ రోజువారీ వ్యాపార మూలధనం కోసం ప్రైవేట్, వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా వారి ఆదాయాలను మెరుగుపరచడానికి రూ.13వేలు వంతున సున్నా వడ్డీ రుణాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఎల్‌డిఎం ఎం.సూర్యకిరణ్, మెప్మా పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం, పంట చేతికందుతున్న సమయంలో సంభవించిన తుపానుతో రైతులు తీవ్రంగా నష్టపోయారని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. పంట దిగుబడి తగ్గి రైతులకు పెట్టుబడులూ రాని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతిభవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు, సాగునీరందించలేని ప్రభుత్వ విధానాలతో జిల్లాలో చాలామంది రైతులు సాగుకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం వలసలు వెళ్లే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 కూలి చెల్లించాలన్నారు. జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. జిల్లాలోని ఏ రైల్వేస్టేషన్‌లో చూసినా రైతులు వలసలు వెళ్లే పరిస్థితి కనిస్తోందన్నారు. మరోవైపు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. పనికి తగిన వేతనం ఇవ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్లపై నెల రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గురుగుబెల్లి రాజేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి డోల శంకరరావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలకు నిలయం ఉద్దానం

సిక్కోలు జానపద కళా జాతరలో మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

జానపద కళలకు నిలయం ఉద్దానమని, సమాజంలో అసమానతలు తగ్గించడం కోసం, పీడిత ప్రజల ఆర్థిక సమానత్వం సాధించడం కోసం, సమాజంలో సమానత్వం సిద్ధించడం కోసం కొంతమంది కలం పట్టారని, కొంతమంది తుపాకీలు పట్టారని, మరికొంత మంది ఒక చేతితో కలం, మరో చేతితో కత్తి పట్టిన యోధానుయోధులు ఉన్న మన ప్రాంతంలో పుట్టి పెరగడం ఒక అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సిక్కోలు జానపద కళాజాతరలో భాగంగా గురువారం మండలం గురుదాసుపురంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాల్లో ఏ స్థాయిలో ఉన్నప్పటికీ మన మూలాలు, స్నేహితులు, మన ప్రాంతాన్ని మార్చిపోకూడదనే ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని, తనకు పెద్దఎత్తున స్వాగతం పలికిన గురుదాసుపురం గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఏడాది సంక్రాంతి ముందు కళాజాతర వంటి కార్యక్రమాలు కొనసాగించడం హర్షనీయమన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ మరుగన పడిపోతున్న కళలను భావితరాలకు తెలియజేసే ప్రయత్నం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉద్దాన ప్రాంతంలో జానపద కళలను పరిరక్షించేందుకు యువత కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వాహకులు మంత్రి అప్పలరాజు, గౌతు శిరీషను ఘనంగా సన్మానించారు. ముందుగా ఆంధ్ర, తెలంగాణ, ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ కళారూపాలు ఉద్దాన ప్రాంత ప్రజలకు కనువిందు చేశాయి. కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, గురుదాసుపురం సర్పంచ్ కుత్తుం రూపావతి, టిడిపి మండల అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, రాపాక ధనరాజ్, కుత్తుం వినోద్ కుమార్, సొర్రా ఢిల్లీరావు పాల్గొన్నారు.



రాష్ట్రంలో విధ్వంస పాలన

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా విధ్వంస పాలన సాగుతోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. అరాచక పాలనను అంతమొందించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్న ఆలోచన ప్రజల్లో మొదలైందన్నారు. అందువల్లే తెలుగుదేశం ఇచ్చిన రా.. కదలిరా పిలుపునకు... చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సభలకు పెద్దఎత్తున ప్రజలు తరలివస్తున్నారని చెప్పారు. గత ఎన్నికల సమయంలో జగన్ 632 హామీలు ఇచ్చి మాట తప్పారని అందువల్లే అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేయగా, నేడో రేపో 108, 104 ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారని చెప్పారు. నాడు హామీలు ఇచ్చిన జగన్ తెరచాటున దాగి ఉంటే సంబంధం లేని సజ్జల రామకృష్ణారెడ్డి కొత్త హామీలు ఇచ్చి మరోసారి మోసం చేస్తున్నారని విమర్శించారు.

గత ఎన్నికల సమయంలో మాట తప్పిన వారిని చీపుర్లతో కొట్టండి అని చెప్పి ముఖ్యమంత్రి అయిన జగన్‌కు ఇప్పుడు ఎలా గౌరవించాలో ఆయనే చెప్పాలన్నారు. జిల్లాలో గౌరవప్రదమైన స్పీకర్ స్థానంలో ఉన్న తమ్మినేని సీతారాం ఆ పదవికి కళంకం తెచ్చారని చెప్పారు. పదవి కోసం విలువలను మంటగలిపిన సీతారాంకు ఇప్పుడు టిక్కెట్ ఇవ్వనని చెప్తున్నారని తెలిపారు. అంగన్వాడీలకు టిడిపి ప్రభుత్వం వచ్చాక పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామన్నారు. మాట తప్పిన జగన్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, బొణిగి భాస్కరరావు, సింతు సుధాకర్, మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఉపసంహరించుకోవాలి

- **అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్**
- **31వ రోజుకు అంగన్వాడీల సమ్మె**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ప్రభుత్వ బెదిరింపుల్లో భాగంగా ఇస్తున్న నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, ఉపాధ్యక్షులు పి.లతాదేవి డిమాండ్ చేశారు. లేకుంటే నిరవధిక నిరాహార దీక్షతో పాటు చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు. నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద 24 గంటల నిరాహార దీక్షను కొనసాగించారు. శిబిరం వద్ద వారు మాట్లాడుతూ అంగన్వాడీలు 31 రోజులుగా అంకుఠిత దీక్షతో పోరాడుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయడం లేదని తెలిపారు. అంగన్వాడీలకు గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి సంఘీభావం తెలిపి రూ.ఐదు వేల విరాళం అందజేశారు. దీక్షలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎన్.హైమావతి తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో ఐసిడిఎస్ కార్యాలయం సమ్మె శిబిరాన్ని సందర్శించి జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఒక మెట్టు దిగి అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.భూలక్ష్మి, మొదలవలస లత, మాధవి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రణస్థలం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సమ్మె 31 రోజులకు చేరిన సందర్భంగా 31 ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత తదితరులు పాల్గొన్నారు. పొందూరులో తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, నాగరత్నం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలో బస్టాండ్ కూడలి వద్ద సమ్మె శిబిరం కొనసాగింది. శిబిరంలో అంగన్వాడీ కార్యకర్త ఒకరు సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెళియాపుట్టి మండలంలోని చాపరలో సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పట్టుదలతో పోరాడాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధ, నారాయణమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో సమ్మె శిబిరం వద్ద ఆటాపాటా నిర్వహించారు. యుటిఎఫ్ నాయకులు పాలవలస ధర్మారావు, తమ్మినేని వైకుంఠరావు, కె.దాలయ్య జానపద గీతాలతో ఆలపించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.రమణమ్మ, ఆదిలక్ష్మి, సిహెచ్.ఇందుమతి తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో గంగిరెద్దుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న, యూనియన్ నాయకులు కె.వి హేమలత, కె.లక్ష్మి, ధనలక్ష్మి, జలజాక్షి తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు హనుమంతు ఈశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు : గంగిరెద్దుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు



రణస్థలం : 31 రోజుల ఆకారంలో కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


టెన్నికాయిట్ ఆడుతున్న క్రీడాకారులు

రసవత్తరంగా టెన్నికాయిట్ పోటీలు

ప్రజాశక్తి- పలాస

పలాస జూనియర్ కళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న 47వ జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో పురుషులు, మహిళా క్రీడాకారులు పాల్గొని తమ సత్తాను చాటారు. రెండో రోజు గురువారం పురుషుల విభాగం క్వాటర్ ఫైనల్ టెన్నికాయిట్ విభాగంలో ఒడిశాపై తమిళనాడు జట్టు, తెలంగాణపై కేరళ జట్టు, మహారాష్ట్రపై పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్‌పై కర్ణాటక జట్లు విజయం సాధించింది. అలాగే మహిళా విభాగంలో క్వారట్ ఫైనల్ పోటీల్లో పశ్చిమబెంగాలపై తమిళనాడు జట్టు, తెలంగాణపై మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌పై కేరళ జట్టు, కర్ణాటకపై పాండిచ్చేరి జట్లు విజయం సాధించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఫ్లెడ్లైన్స్ వెలుగుల్లో జరిగిన ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు వై.డి.రామారావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఎన్.వి.సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి పి.తవిటయ్య, జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, రాష్ట్ర వ్యాయామ విద్య, ఉపాధ్యాయ సంఘం ముఖ్య సలహాదారులు పి.సుందరరావులు పర్యవేక్షించగా స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, హరిబాబు, డి.రామారావు, పద్మలోచనలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడలను ఆడించారు.



ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- ఆమదాలవలస

టైట్లింగ్ యాక్ట్-23పై రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం న్యాయవాదులతో కలిసి కోర్టు ఆవరణలో ప్లకార్డులతో ధర్మాన వ్యాఖ్యలకు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టైట్లింగ్ యాక్టును మంత్రి ధర్మాన సమర్థించడంపై మండిపడ్డారు. టైట్లింగ్ యాక్టు వల్ల ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ధర్మాన వ్యాఖ్యలను న్యాయవాదులంతా ముక్తకంఠంతో ఖండించారు. ప్రభుత్వం వెంటనే టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు, న్యాయవాదులు గురుగుబెల్లి ప్రభాకరరావు, తమ్మినేని అన్నం నాయుడు, వాడవలస రాజేశ్వరరావు, బూర్లె సీతారాం, బొడిగి రమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

కవిటి: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా కవిటి, శిలగాం, బొరివంక వేదికల్లో బుధవారం జరిగిన క్రికెట్, ఖోఖో పోటీల్లో పలు జట్లు విజయం సాధించాయి. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, పూడి నీలాచలం, పాండవ చంద్రశేఖర్, ఎన్ని అశోక్, ఇఒఆర్డి శివాజీ పాణిగ్రాహి, ఎఒ శ్రీనివాస రెడ్డి, ఇఒ వీరభద్రస్వామి, కార్యదర్శి మన్మథరావు, విఆర్ఒ నారాయణ పాల్గొన్నారు.

పోలాకి: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్రీడాకారులుగా ప్రోత్సాహించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల ప్రత్యేక సలహారులు ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. మండలంలోని కోడూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, యువజన విభాగం అధ్యక్షుడు ఆర్.త్రినాథరావు, చింతాడ ఉమా, ఎస్‌సిసెల్ అధ్యక్షులు కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

జి.సిగడాం: ఆడుదాం ఆంధ్రా పోటీలు మండలంలో


జి.సిగడాం : విజేతలతో ఎంపిడిఒ నిశ్చల

ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. యువత ఈ పోటీల్లో పెద్దఎత్తున పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఎంపిడిఒ కె.నిశ్చల అన్నారు. ఇప్పటికే గ్రామస్థాయి పోటీలు ముగియగా, బుధవారం నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. సచివాలయ స్థాయిలో గెలుపొందిన జట్లు మండలస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. రెండవ రోజు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. మండలస్థాయి పోటీల్లో విజేతలు, నియోజకవర్గ స్థాయి పోటీల్లో తలపడతారని తెలిపారు. ఆనందపురం నుంచి కబడ్డి, వాలీబాల్ మండలస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయికి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఎంపిడిఒ, మండల స్థాయి అధికారులు ఈ పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శులు కూనిబిల్లి కోటేశ్వరావు, ఎస్.రాజా రమేష్, పొట్నూరు సురేష్, కిమిడి హైమావతి, హిమ బిందు, పైల జైరాం, చేబ్రోలు సురేష్, పప్పల శ్రీనివాసరావు, రౌతు చైతన్య కుమారి, పిఇటిలు పాల్గొన్నారు.

పోలీసుల పర్యవేక్షణలో క్రీడా పోటీలు

టెక్కలి : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల వేదిక గురువారం మారింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలోనే అన్ని క్రీడలు నిర్వహించడం కష్టతరంగా ఉండడంతో కొన్ని క్రీడలు జూనియర్ కళాశాల మైదానానికి తరలించారు. అయితే బుధవారం జరిగిన క్రీడల్లో క్రీడాకారులు కొట్లాడుకోవడంతో గురువారం పోలీసుల పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. ఈ మేరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. ఎప్పటికప్పుడు పోలీసులు క్రీడా మైదానాన్ని సందర్శిస్తూ... పర్యవేక్షించడంతో సజావుగా సాగాయి. చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, కె.కె.రామిరెడ్డి, రాజా, యరపత్ని వెంకటరమణ, కాపల రఘునాథరావు నిర్వహించారు.

కిరణ్‌కు టిక్కెట్ ఇస్తే రాజీనామా

ప్రజాశక్తి- లావేరు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు మరలా టిక్కెట్ ఇస్తే తామంతా మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని నాలుగు మండలాలకు చెందిన వైసిపి నాయకులు, కిరణ్ వ్యతిరేక వర్గం నాయకులు హెచ్చరించారు. గురువారం మండలం తాళ్లవలసలో నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. జగన్ ముద్దు కిరణ్ వద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ నాయకులు లుకాలపు అప్పలనాయుడు, జరుగుళ్ల శంకరరావు, పైడి భాస్కరరావు, బురాడ వెంకటరమణలు మాట్లాడుతూ కిరణ్ కోసం 2014, 2019 ఎన్నికల్లో తాము కష్టపడి పనిచేసామని, 19 వేల ఓట్లు మెజారిటీతో గెలిపిస్తే తమకు పార్టీ కార్యకర్తలమనే కనీస గౌరవం ఇవ్వకుండా ఎమ్మెల్యే మాకు ఇబ్బందులు పెట్టారని, గతంలో తాము అసంతృప్తి గళం వినిపిస్తే జిల్లా పార్టీ అధ్యక్షుడు, జిల్లా మంత్రి, ఇన్‌ఛార్జి మంత్రులు చెప్పడంతో సమయం వచ్చినప్పుడు చెప్పుదురు, ఇప్పుడు నిరసనల సమయం కాదని చెప్పడంతో పెద్దల మాటకి గౌరవం ఇచ్చి ఇన్నాళ్లు మిన్నకున్నామన్నారు. ఇప్పుడు సమయం ఆసన్నమైందని, అందుకే తాము రోడ్డు ఎక్కి ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా తాము పని చేస్తామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కిరణ్‌కు కాకుండా ఇతరులు ఎవరికి టిక్కెట్ ఇచ్చినా తాము పార్టీకోసం కష్టపడి పనిచేసి గెలిపిస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు అల్లు బాస్కరరావు, సాకేటి నాగరాజు, తేనెల సురేష్ కుమార్, మాజీ సర్పంచ్‌లు శివంగం నాగరాజు, గొర్లె రామునాయుడు, వి.సత్యం పాల్గొన్నారు.

కిరణ్‌కే ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి- రణస్థలం


నినాదాలు చేస్తున్న నాయకులు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కే టిక్కెట్ ఇవ్వాలని పలువురు వైసిపి నాయకులు కోరారు. మండల కేంద్రంలో గురువారం జెడ్‌పిటిసి టొంపల సీతారాం ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ విజయనగరం జిల్లాకు చెందిన ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌కు ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అధిష్టానం నియమించి, ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని ప్రచారం జరగడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యతిరేకిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కిరణ్‌కే టికెట్ ఇవ్వాలని కోరారు. పార్టీలో చిన్నచిన్న విబేధాలు, వ్యతిరేకతలు ఉంటాయని, ఇది ఒక్క వైసిపిలోనే కాదని అన్ని రాజకీయ పార్టీల్లో ఉంటాయన్నారు. కిరణ్‌కుమార్‌కు టిక్కెట్ ఇస్తే నియోజకవర్గ నాయకత్వం, పార్టీ కార్యకర్తలంతా ఏకతాటిపై వచ్చి కిరణ్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. వలస నాయకులు వస్తే స్థానికులు ఆదరించరని, స్థానిక నాయకులకు మాత్రమే ఆదరిస్తారని, అధిష్టానం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోకపోతే ఎచ్చెర్ల సీటు చేజారిపోతుందన్నారు. కొన్నేళ్లుగా పార్టీ జెండాలు మోసి పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్తూ వారి కష్ట నష్టాల్లో పాలు పంచుకుంటున్న స్థానికులకు కాకుండా స్థానికేతరులకు టికెట్ ఇస్తే మద్దతు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు లంకలపల్లి ప్రసాద్, రాయపురెడ్డి బుజ్జి, భవిరి రమణ, చిల్లా వెంకటరెడ్డి, పిన్నింటి సత్యం నాయుడు, గొర్లె అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్రీడాకారుడు మృతి

ప్రజాశక్తి- మందస

రోడ్డు ప్రమాదంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాకారుడు మృతి చెందిన సంఘటన గురువారం మందస మండలంలో చోటుచేసుకుంది. మందస మండలం కొంకడపుట్టి పంచాయతీ సియాలుట్టి గిరిజన గ్రామానికి చెందిన సవర ఉమాపతి (34) ఆడుదాం ఆంధ్రా పోటీలకు గురువారం మందస వచ్చారు. సాయంత్రం తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కిల్లోయి గ్రామ సమీ పంలో ద్విచక్రవాహనం, ఆటో పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఉమాపతి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం పలాస పిహెచ్‌సికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు వెళ్లిన ఉమాపతి కొద్ది గంటల్లోనే ఇలా మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదన మిన్నంటాయి. మందస పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.


జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌పి రాధిక

సేవలతో గుర్తింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని ఎస్‌పి జి.ఆర్ రాధిక పేర్కొన్నారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేసిన కొవ్వూరు అప్పారావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి సన్మానించి ఆయన సేవలను జ్ఞాపికను, తక్షణ ఆర్థికసాయం కింద రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జె.తిప్పేస్వామి, డిఎస్‌పి వై.శృతి, నాగేశ్వరరెడ్డి, ఆర్ఐ కె.నర్సింగమూర్తి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గ్రామకంఠ భూమిని రీసర్వే చేయించాలి

టెక్కలి : మెళియాపుట్టి మండలం పెద్దమడి గ్రామకంఠ భూమిని రీసర్వే నిర్వహించాలని డిఎల్‌ఒ జిల్లా అధ్యక్షులు సవర కుమార్, గేదెల రమణమూర్తిలు కోరారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దమడి గ్రామకంఠ స్థలాన్ని రీసర్వే చేయించి ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. ఖాళీ స్థలాల్లో ప్రభుత్వం భవనాలను నిర్మించాలన్నారు. ఆక్రమిత భూములను రీ సర్వే చేయించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రమేష్, వెంకటరావు, రాజు, రవి పాల్గొన్నారు.

రాగోలు రోడ్డు దుస్థితిపై టిడిపి ఆందోళన


ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : సిఎం జగన్ పాలనలో రాష్ట్రంలో రోడ్లు అధ్వాన్నస్థితిలో ఉన్నాయని, ఈరోడ్లపై ప్రయాణించేందుకు ప్రజలు అనేక కష్టాలు అనుభవిస్తున్నారని టిడిపి నాయకుడు, జిల్లా సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ పేర్కొన్నారు. రా కదలిరా, బాబుతోనే భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలో రాగోలు వద్ద ప్రధాన రహదారిని టిడిపి శ్రేణులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారులు పూర్తి అధ్వాన్న స్థితిలో ఉన్నాయని, శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రహదారి గోతులమయం కావడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. పది అడుగుల రోడ్డు వేసి మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం ఆర్భాటం చేస్తున్నారన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు రావాలని, టిడిపితోనే భవిష్యత్‌కు గ్యారెంటీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ మూకళ్ల శ్రీను, అలికాం సర్పంచ్‌లు రంధి అప్పలస్వామి, బైరి నరేష్, మాజీ సర్పంచ్‌లు పేడాడ రామారావు, పంచిరెడ్డి అప్పలనాయుడు, తెలుగు రైతు సంఘం మండల అధ్యక్షుడు బగ్గు నలమహారాజు పాల్గొన్నారు.

జగనన్న సంక్రాంతి సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో రావికంటిపేటలో జగనన్న సంక్రాంతి సంబరాలు వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు సుందరరావు మాస్టారు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ రమణ, రిఫరీ బోర్డు చైర్మన్ తిరుపతిరావు, కబడ్డీ బోర్డు చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని, క్రీడాకారులకు అవసరమైన పూర్తిస్థాయి వసతులన్ని కల్పించామన్నారు. అనుభవజ్ఞులైన ఫిజికల్ డైరెక్టర్లు, పిఇటిల పర్యవేక్షణలో క్రీడలను నిర్వహిస్తున్నామని


కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పేర్కొన్నారు. నైపుణ్యం గల 16 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. ప్రతి జట్టుకు యూని ఫామ్ కిట్లును రవికుమార్ అందజేశారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.50వేలు నగదు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20వేలు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

దేశాభివృద్ధికి పాటుపడాలి

టెక్కలి రూరల్: ప్రతిపౌరుడూ అంకిత భావంతో దేశాభివృద్ధికి పాటుపడాలని టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. కేంద్ర యువజన-క్రీడల మంత్రిత్వశాఖ ఆదేశం మేరకు శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన గురువారం ఐతమ్ కళాశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. యువతపైనే దేశ భవిష్యత్ ఆదారపడి ఉందని సెట్, నెహ్రూ యువ కేంద్రం, పర్యాటక శాఖలు సంయుక్తంగా 'డిక్లమేషన్ కంటెస్ట్ ఆన్ మైబర్త్-వికసిత భారత్ 2047' అనే అంశంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన ఐతమ్ విద్యార్థులు టి.షణ్ముఖరావు, ఎస్.అవినాష్, జె.అప్పన్నలకు ప్రసంశపత్రాలను అందజేశారు. అనంతరం సెట్ సిఇఒ వి.వి.ప్రసాదరావు, పర్యాటక శాఖ అధికారి డి.నారాయణరావు, నెహ్రూ యువ కేంద్రం గణాంకాధికారి డి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, పోటీ పరీక్ష న్యాయ నిర్ణేతలుగా ప్రొఫెసర్ కె.వేణుగోపాల్, టిపిసి ఇన్‌ఛార్జి శ్రీకాంత్, డాక్టర్ బి.రాజేష్, ఇఇఇ హెచ్‌డి డాక్టర్ కె.కిరణ్‌మార్, డాక్టర్ బి.శివకుమార్ పాల్గొన్నారు.

పల్లెల్లో హరిదాసుల సందడి

ప్రజాశక్తి- బూర్జ

సంక్రాంతి పండగ మొదలైందంటే ముందుగా మనకి కనిపించేది హరిదాసులే. హరి దాసుల రాకతో మండలంలో అన్ని గ్రామాల్లో సంక్రాంతి సందడి సంతరించుకుంది. పల్లెల్లో పట్టణాల సైతం తెల్ల తెల్లవారక ముందే హరిదాసులు తలపై అక్షయపాత్ర పెట్టుకుని మెడలో నిలువెత్తు పూలదండతో పట్టు పీతాంబరాలు కట్టుకుని ఒక చేతిలో చిడతలు, మరో చేతిలో తుంబుర, నుదుట నామాలు ధరించి కాళ్లకు గజ్జలు కట్టుకొని కంచు కంఠంతో హరినామస్మరణ చేస్తూ ప్రతి ఇంటి ముంగిటకు వచ్చి పల్లెలకు సంక్రాంతి శోభను నెల రోజులు పాటు తీసుకువచ్చే హరిదాసులు మండలంలో అన్ని గ్రామాల్లోనూ సందడి చేస్తున్నారు.

ఒకవైపు ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తు మరోవైపు శ్రావ్యంగా హరినామస్మరణ చేస్తూ దశాబ్దాలుగా దైవ చింతనలో హరిదాసులు ఉండడం విశేషం.



మాట్లాడుతున్న మండల ఎఒ భార్గవి

వాడివేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో ఎక్కడాలేని డిప్యుటేషన్ తన ప్రాదేశికం బిర్లంగ్ పంచాయతీలో ఎందుకు వేశారని టిడిపి ఎంపిటిసి దక్కత ఏకంబరిదేవి అధికార యంత్రాంగంపై మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన గురువారం సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా వైద్య శాఖ సమీక్షలో ఆమె అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనవసరం వైద్యసిబ్బందిని పంపించడం వల్ల బుధవారం నిర్వహించాల్సిన వ్యాక్సినేషన్ నిలిచిపోయిందని అన్నారు. గ్రామస్తులు గాని, నాయకులు గాని వైద్య సిబ్బందిపై ఎటువంటి ఫిర్యాదులు చేయకపోయినా డిప్యుటేషన్‌పై ఎందుకు పంపిస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. అలాగే వ్యవసాయశాఖ సమీక్షాలో ధాన్యం అమ్మకాలల్లో కలుగుతున్న ఇబ్బందులు ప్రస్తావించారు. ఇచ్ఛాపురం నుంచి పలాస, టెక్కలి రైస్ మిల్లులకు పంపించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు గుజ్జు దిల్లేశ్వరరావు, నీలపు సారథి సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మండల ఎఒ భార్గవి మాట్లాడుతూ మండలంలోని ఏకైక మిల్లు బ్యాంకు గ్యారంటీ అయిపోవడంతో పక్కన ఉన్న మిల్లులకు పంపిస్తున్నామని వెల్లడించారు. ట్రాక్టర్‌తో టెక్కలి వరకు ధాన్యం తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని తెలుకుంచి సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ట్యాగ్‌కు ముందు తెలిస్తే ట్రాక్టర్ బదులు వేరే వాహనం పెట్టుకోడానికి వీలు కలుగుతుందన్నారు. ఎస్మా చట్టం జారీ చేసిన అంగన్వాడీ కార్యకర్తలలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సర్పంచ్ నర్తు వరప్రసాద్ ఐసిడిఎస్ అధికారి నాగారాణిని నిలదీశారు. దీనిపై ఆమె స్పందిస్తూ... ఇప్పటికే అన్ని కేంద్రాలకు నోటీసులు జారీ చేశామని, ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటామని నాగారాణి తెలిపారు. రేషన్ సరుకులు పంపిణీలో ఇంటింటికీ రేషన్ సరుకులు చాల గ్రామాల్లో జరగడం లేదని సభ్యులు కారింగ మోహనరావు అన్నారు. కొన్ని గ్రామాల్లో కందిపప్పు పంపిణీ చేస్తూ... కొన్ని ప్రాంతాల్లో పంపిణీ చేయడం లేదని, దీంతో గ్రామాల్లో గొడవలు జరుగుతున్నాయని సభ్యులు ఏకాంబరిదేవి డిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. రైతులు శిస్తులు కట్టినా ఛానల్ మరమ్మతులు చేపట్టలేదని సభ్యుడు త్రినాథ ఇరిగేషన్ ప్రతినిధి రాజును ప్రశ్నించారు. బహుదా ఛానల్ వద్ద ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనివల్ల ఛానల్ మరమ్మతులు గురవుతున్నాయని సభ్యులు ఫిర్యాదు చేశారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఎంఇఒ అప్పారావు, డాక్టర్ వేచ్చా సంతోష్, వెలుగు ఎపిఎం ప్రసాదరావు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి బిసిలకు అన్యాయం చేస్తున్నారని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా బిసిలపై దాడులు జరుగుతున్నాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయం సమీపంలో గురువారం జయహో బిసి సభ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా మాజీ సిఎం నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రూ.75 వేల కోట్లు బిసి సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క రూపాయీ కేటాయించలేదని పేర్కొన్నారు. పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు కొండలను మింగేస్తున్నారే తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించారు. రైల్వే వంతెన పనులు పూర్తి చేయలేదని, ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులను ఒక్క శాంతమైన చేశారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, దువ్వాడ హేంబాబు చౌదరి, టంకాల రవి శంకర్ గుప్తా,


ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న శిరీష

బి.నాగరాజు, కొవ్వూరు సురేష్‌కుమార్, శాసనపురి మురళీకృష్ణ, అట్టాడ వాసు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వైసిపి ప్రభుత్వంలో బిసిలకు అడుగు అడుగునా అవమానాలేనని టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాలినా ఢిల్లీ యాదవ్ ఒక ప్రకటనలో విమర్శించారు. వైసిపి పెద్దిరెడ్డి, విజయ సాయిరెడ్డి, సజ్జల సుబ్బారెడ్డిల ముందు తలవంచక తప్పడం లేదని ఆ పార్టీ నేతలే చెబుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు లేక... ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని అన్నారు.


నౌపడ : ప్రతిజ్ఞ చేయిస్తున్న సీతారాములు

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి- కవిటి

సమాజంలో బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలకు దారితీస్తాయని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎపిఎం కె.గోవింద్ అన్నారు. భేటీ బచావో, భేటీ పడావోలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, బాల్య వివాహాల నిషేధిత చట్టం-2006పై స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఎపిఎం మాట్లాడుతూ బాలల రక్షణ కమిటీల ద్వారా పొదుపు సంఘాల మహిళలు గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రక్షణ విభాగం న్యాయ పర్యవేక్షణ సిబ్బంది శ్రీలత, లక్ష్మణ, సామాజిక కార్యకర్త మధురమీనాక్షి పాల్గొన్నారు.

నౌపడ: బాల్య వివాహాలను అరికట్టి బాలల హక్కులు, సంరక్షణకు పాటు పడాలని జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ ధర్మాన సీతారాములు కోరారు. సంతబొమ్మాళి మండలం వెలుగు కార్యాలయంలో గురువారం ఎపిఎం తుంగాన సూర్యనారాయణ ఆధ్వర్యాన బాల్య వివాహ నిషేధ చట్టం జిఎం నంబరు 31పై మహిళా సంఘాలకు గురువారం అవగాహన కల్పించారు. బాలల రక్షణ ఫోక్సో యాక్టు, విద్యాహక్కు చట్టం, గర్భలింగ నిర్ధారణ పరీక్షల నిషేద చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

యువజనోత్సవాలకు ఉన్నతి అకాడమీ విద్యార్థి

ప్రజాశక్తి- కవిటి

జాతీయస్థాయి యువజనోత్సవాలకు కవిటికి చెందిన ఉన్నతి డాన్స్ అకాడమీ విద్యార్థి సాయి నితీష్ ఎంపికైనట్టు అకాడమీ డైరెక్టర్లు పి.బి.కె.శర్మ, ప్రసాద్ తెలిపారు. విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో జానపద నృత్యం వ్యక్తిగత విభాగంలో ఉన్నతి డాన్స్ అకాడమీకి చెందిన విద్యార్థి కడియాల సాయి నితీష్ ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న మహారాష్ట్రలోని నాసిక్‌లో జరగనున్న జాతీయస్థాయి యువజన ఉత్సవాల్లో సాయినితీష్ ప్రదర్శన ఉంటుందని శర్మ, ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థికి, ఉన్నతి అకాడమీ బృందానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు


ప్రశంసాపత్రం అందజేస్తున్న శర్మ

రామారావు, నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్, ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘ అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్ అభినందించారు.


భోగి మంట వేస్తున్న కళాశాల సిబ్బంది

'పద్మావతి'లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఆనందోత్సవాల మధ్య జరిగాయి. సంక్రాంతి లక్ష్మి, గాలిపటం తయారీ, బొమ్మల కొలువు, పల్లెల్లో సంక్రాంతి, భోగి, కుండల అలంకరణ, రంగోళి ఇలా వివిధ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాల వైశిష్ట్యాన్ని విద్యార్థులకు తెలియజేసే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇ.ఎం.నాయుడు, అకాడమిక్ ఇన్‌ఛార్జి ముకళ్ల శ్రీనివాసరావు, ఎఒ మోహన్‌దాస్, ప్లేస్‌మెంట్ అధికారి మేరీ రత్నం పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలకు

నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, జనరల్ ఆస్పత్రిలో వివిధ క్యాడర్ల వారీగా ఖాళీగా ఉన్న 40 ఉద్యోగ నియామకాలకు గురువారం జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఈనియామకాలు చేపడుతున్నట్టు ఆయన వివరించారు. ఈ నియాకాలకు ఈనెల 12 నుంచి 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. మరన్ని వివరాలకు శ్రీకాకుళం.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్లో సంప్రదించాలని ఆయన సూచించారు.


మాట్లాడుతున్న నర్సింగరావు

దేశ భద్రత ప్రతి పౌరుడి బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

భారతదేశ రక్షణ బాధ్యత దేశంలోని ప్రతి పౌరుడి బాధ్యత కావాలనిఉపన్యాసకులు ఎన్.నర్సింహమూర్తి అన్నారు. శారద రామకృష్ణ సేవాసమితి సారథ్యంలో నిర్వహిస్తోన్న జాతీయ యువజన వారోత్సవాలు గురువారం నగరంలోని ఇండియన్ ఆర్మీ కాలింగ్ (భారత సైన్యం పిలుస్తోంది) ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవ కన్వీనర్ మందపల్లి రామకృష్ణారావు మాట్లాడుతూ దేశంపై ప్రేమ, సమాజంపై బాధ్యత కలిగిన పౌరులు తయారు కావాలని పిలుపునిచ్చారు. మాజీ సైనిక అధికారి పి.గోవిందరావు దేశంపై సైనికుల గల బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో ఐఎసి డైరెక్టర్ బి.వి.రమణ అధ్యక్షతన లాల్‌బహదూర్‌శాస్త్రి, వివేకానంద చిత్రపటాలకు పూలమాలలను వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిహెచ్.శ్రీకాంత్, ఎస్.నర్సింగంవు, ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్‌పిటిసి వసంతరెడ్డి

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- నౌపడ

ఆక్వా రైతులు పడుతున్న వివిధ రకాల సమస్యలనుపరిష్కరించాలని సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాలవసంత రెడ్డి అన్నారు. శ్రీకాకుళం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఆక్వా రైతులకు గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సులో పాల్గొని మాట్లాడారు. సంతబొమ్మాళి మండలంలో 500 ఎకరాలు సాగు చేస్తున్న రైతులు వైరస్ ద్వారా ఇబ్బందులు పడుతున్నారని మత్స్యశాఖ జెడి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. అందరూ ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. మేతలో నాణ్యత పెంచాలని, ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

సమాజ సేవకు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సమాజ సేవలకు యువకులు భాగస్వాములు కావాలని కలమట వెంకటరమణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని కోసమాలలో స్వాతంత్ర సమరయోధులు అంకడాల లక్ష్మీనారాయణ ఛారిటబుల్ ట్రస్టును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఛారిట్రబుల్ ట్రస్టు ద్వారా పేద ప్రజలకు ఎన్నో సేవలు అందించాలని ఆకాంక్షించారు. అంతకుముందు అంకడాల లక్ష్మీనారాయణ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు అంకటాల వేణుగోపాలరావు, మాజీ సర్పంచ్ అంకడాల లోకనాథం, బొచ్చు ప్రసాదరావు, ఎస్.సుబ్బారావు మాస్టర్, వెంకటరావు, ఉర్లాన వసంత్, మాలతి శ్రీధర్, బసవ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

ఉపాధ్యాయుల ఔదార్యం

కవిటి: మండలంలోని ఉపాధ్యాయులు ఔదార్యం చాటుకున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ కవిటి మండలం సిబ్బందికి రూ.నాలుగైదు నెలల నుంచి జీతాలు లేకపోవడంపై స్పందించారు. తమవంతుగా రూ.32 వేలును ఎంఇఒ ధనుంజయ మజ్జి చేతుల మీదుగా సమగ్ర శిక్ష అభయాన్ సిబ్బంది సంతోష్, తులసయ్యకు గురువారం అందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు జి.జానకిరావు, ఉపాధ్యాయులు రాంబాబు, శరత్, రామకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధులకు అండ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో ఖ్యాతి వృద్ధాశ్రమంలో గురువారం హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యాన వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హిందీ మంచ్ అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, రొంపివలస రామారావు మాట్లాడుతూ హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ భాష హిందీ ప్రచార కార్యక్రమాలతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రావణి, విశాఖ గ్రామీణ బ్యాంకు మేనేజర్ దొంతం సత్యనారాయణ పాల్గొన్నారు.

నల్లి ధర్మారావుకు మాతృవియోగం

ప్రజాశక్తి- పాలకొండ

సీనియర్ జర్నలిస్టు, కవి నల్లి ధర్మారావు తండ్రి కృష్ణంనాయుడు (82) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కృష్ణంనాయుడు అనారోగ్యానికి గురి కావడంతో స్వగ్రామం అర్దలిలో నివాసం ఉండేవారు. కృష్ణంనాయుడుకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ధర్మారావు, రెండో కుమారుడు నాగవంశపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, కృష్ణంనాయుడు ఉన్నాడు. గురువారం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎంపీ నిధులతో రచ్చబండ నిర్మాణం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో కొర్లకోట గ్రామంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎంపీ లాడ్స్ నిధులతో రచ్చబండ నిర్మాణం చేపడుతున్నట్లు కొర్లకోట సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు తెలిపారు. గురువారం రచ్చబండ నిర్మాణం చేపట్టనున్న గ్రామంలో పెద్ద కోనేరు రావి చెట్టు వద్ద మండల ఇంజనీరింగ్ అధికారి జ్యోతి స్థల పరిశీలన చేసారు. కోనేరు రక్షణ గోడ, రావి చెట్టు వద్ద రచ్చబండ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ రామ్మోహన్ నాయుడును కోరగా రూ.4.95 లక్షలు మంజూరు చేసినట్లు అప్పలనాయుడు తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కోడిపాత్రుని మల్లేశ్వరరావు ఎంపీ రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.


రచ్చబండ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న జ్యోతి

జనావాసాలకు దూరంగా రైల్వే ట్రాక్ నిర్మించాలి

ప్రజాశక్తి- నౌపడ

మండలంలోని మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు కోసం నిర్మిస్తున్న రైల్వే ట్రాక్ అలైన్‌మెంట్ మార్చాలని, జనావాసాలకు దూరంగా నిర్మించాలని కూర్మనాథపురం గ్రామస్తులు కోరారు. సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశాల మేరకు రైల్వే ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించేందుకు గురువారం తహాశీల్దార్ చలమయ్య నౌపడ, కూర్మనాథపురం, జగన్నాథపురం, గ్రామాల్లో భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యాన గ్రామస్తులు తహాశీల్దార్‌ను కలిశారు. రైల్వే ట్రాక్‌కు గుర్తించిన భూమి తమ నివాసాలుకు దగ్గరలో ఉండడంతో భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. నిర్మాణ ప్రదేశం తమ ఇంటికి, ఆలయాలకు చేరువుగా ఉన్నాయని, తూర్పు దిక్కున 60 అడుగులు తరలించి మార్పులు చేయాలని కోరారు. దీనిపై తహాశీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సమాచారం అందజేస్తామని తెలిపారు.


తహాశీల్దార్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

రైతుల పడిగాపులు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులు పండించుకునే ధాన్యం మిల్లర్లకు ఇచ్చేందుకు పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ట్రక్కు షీట్లు వచ్చి మిల్లు పేరు వచ్చినా.. మిల్లులు వద్ద ధాన్యం లోడులు దిగుమతులు కాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఒక్కో మిల్లు వద్ద తమ ధాన్యం లోడులు దిగుమతి కావాలంటే పలు అవస్థలను ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఆర్‌బికె వద్ద ట్రక్కు షీట్లు కోసం నానా యాతనలు పడి ధాన్యం మిల్లు వద్దకు తీసుకెళ్తే... మిల్లర్లు నిబంధనల పేరుతో లోడులను దిగుమతి చేయించుకునేందుకు వ్యతిరేకిస్తున్నారని మండిపడుతున్నారు. ధాన్యం బాగోలేదని, తేమ శాతం ఆధికంగా ఉందని మిల్లర్లు చెబుతూ బస్తా ఒక్కంటికీ 2 నుంచి 3 కిలోల వరకు తగ్గిస్తున్నారని వాపోయారు.


మిల్లు వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు

నవరత్నాలతో సంక్షేమ పాలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అందజేస్తున్న నవరత్నాలతో సంక్షేమ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. గురువారం మండలంలో కలివరం పంచాయతీ తమ్మయ్యపేట, కంచరాపువానిపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టిడిపి హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా పసుపు చొక్కాల వారికే సంక్షేమ పథకాలు అందేవని, నేడు వైసిపి ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు గురుగుబెల్లి గిరి, దశరథ, సన్యాసిరావు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వివరిస్తున్న చిరంజీవి నాగ్

రచయిత 'అట్టాడ'కు సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం రాత్రి వైసిపి జీవన సాఫల్య పురస్కార్ గ్రహీత, నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడును ఘనంగా సత్కరించారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు దుశ్శాలువ కప్పి అభినందించారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హాజరై మాట్లాడారు. సాహితీవేత్తలను అభినందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు విజికె మూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమారరాజు, ఉప గ్రంథపాలకులు వివిజి. ఎస్.శంకరరావు, కవులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు హాజరయ్యారు.


సన్మానిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- లావేరు

మండలంలో తామాడ గ్రామంలో గురువారం శ్రీకాకుళం పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టుశాలి కులస్థుల నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతిఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా జిల్లాలో సురవరం, బొంతలకోడూరు, శ్రీకాకుళం పట్టణం, ధర్మవరం, జాడపేట, బొంతువలస, పొందూరు మెట్ట, చంద్రయ్యపేట గ్రామాల్లో 350 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుంటుకు చంద్రశేఖర్, పేకల రామకృష్ణ, అల్లంశెట్టి మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మాడుగుల బస్వరాజు, దండా హరీష్, కాపల రాము, పూంద్రు సింహాద్రప్పడు, బండారు ఉపేంద్ర పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధిలు


డైరీ ఆవిష్కరిస్తున్న రవికుమార్

వార్షిక డైరీ ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: బిసి న్యాయవాదుల వార్షిక డైరీని గురువారం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆవిష్కరించారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, బిసి న్యాయవాదుల సంఘం ప్రతినిధులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

రాముడు పేరుతో రాజకీయం తగదు

టెక్కలి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అయోధ్యలోని రామమందిరం ప్రారంభోత్సవాన్ని రాజకీయం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు అన్నారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. రామ జన్మభూమి వ్యవహారంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు హస్యాస్పదంగా ఉందన్నారు. మతోన్మాదాన్ని జైశ్రీరామ్ నినాదంతో రెచ్చగొడుతు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో అక్షింతలు పంచడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నెల 22న రామమందిరం ప్రారంభానికి ప్రధానమంత్రి చేస్తున్న హంగామా ఎన్నికల వ్యూహమని అన్నారు. ఖడు పేరును రాజకీయాలకు వాడుకోవడం లౌకిక ప్రజాస్వామ్యంలో తగదన్నారు.

కిష్టప్పపేటలో భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం కిష్టప్పపేట గ్రామంలో రూ.21లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు గురువారం ప్రారంబించారు. ఆలాగే జగనన్న ఇళ్ల కాలనీని ప్రారంభించారు. బస్‌షెల్టరు నిర్మానానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రాంమనోహరనాయుడు, ఎంపిపి ప్రతినిధి శ్రీనివాసరావు, అల్లు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


కాలనీ ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన

జిల్లా కవులకు సత్కారం


సత్కారాన్ని అందుకున్న కవులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఆధ్వర్యాన గురువారం సాహిత్య సంక్రాంతి సంబరం ఉత్సవాలు ఏలూరు జిల్లాలో జరిగాయి. రాష్ట్ర సాహిత్య అకాడమి సౌజన్యంతో శ్రీశ్రీ కళావేదిక అధినేత కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన కవులను సన్మానించారు.

జిల్లా నుంచి అకాడమి ఆహ్వానం మేరకు హాజరైన కవులు మహమ్మద్ రఫీ (ఈ.వేమన), జంధ్యాల శరత్ బాబు, బి.కుమార రాజు (జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి), బి.కోటేశ్వరరావు, పి.వి.దుర్గాప్రసాద్, చాడ శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లి వద్ద జాతీయ రహదారి 16 నుంచి తామరపల్లి వయా నౌగాం వరకు రూ.3.30 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణ పనులకు టెక్కలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దువ్వాడ వాణి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహాశీల్దార్ వై.వి.పద్మావతి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాజారావు, సర్పంచ్ ప్రతినిధి తమరి దేవేంద్ర, ఎంపిటిసి సైలాడ లావణ్య మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫాల్గునరావు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డిని కలిసిన వాణి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని గురువారం టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి విశాఖపట్నంలో కలిశారు. నియోజకవర్గవర్గంలో పలు సమస్యలతో పాటు ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని విన్నవించారు. గడగడప కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించినట్లు తెలిపారు. ఆరోగ్య సురక్ష పథకం ప్రజల్లోకి తీసుకెళ్లి విధంగా కృషి చేయాలన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాణి

విఆర్ఒ గోపికి సన్మానం

ప్రజాశక్తి- పోలాకి

విఆర్ఎల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మబగాం విఆర్ఎ కె.గోపి ఎంపిక కావడం అభినందనీయమని తహాశీల్దార్ కె.శ్రీరాములు అన్నారు. ఈ మేరకు తహాశీల్దార్ కార్యాలయంలో గోపికి గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వాహణలో నిజాయితీగా ఉంటూ సేవలు అందించే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిటి పి.శ్రీనివాసరావు, సర్వేయర్ ఎం.శ్రీరామ్మూర్తి, విఆర్ఒలు వేణు, జగన్నాథం పాల్గొన్నారు.



గోపిని సన్మానిస్తున్న తహాశీల్దార్ శ్రీరాములు

జాడుపూడి ఆర్‌ఎస్‌లో వైద్యశిబిరం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని జాడుపూడి ఆర్‌ఎస్‌లో నవయువ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యాన గురువారం భావ ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ నందన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, మణిచంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పేదలకు వైఎస్ఆర్ బీమా అండ

పలాస : ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ బీమా పథకం పేదలకు అండగా నిలుస్తుందని వార్డు కౌన్సిలర్ ప్రతినిధులు శిష్టి గోపి, బడగల బల్లయ్య అన్నారు. కాశీబుగ్గ సూది కొండ ప్రాంతానికి చెందిన కందా సంతోషి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. తక్షణ సహాయం నిమిత్తం మృతురాలు కుటుంబానికి గురువారం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బగాది సింహాచలం, సీపాన శ్రీరాములు, మార్పు చిన్న, వెల్ఫేర్ సెక్రటరీ విగ్నేష్, వాలంటీర్ దుర్యోధన పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న గోపి